# 4

# నిబంధన మరియు ఆజ్ఞ

## (నిర్గమకాండము 20)

2001 ఆగస్టులో అలబామా సుప్రీం కోర్టునకు చెందిన ప్రధాన న్యాయాధిపతి రాయ్ మూర్ ఐదువేల పౌండ్ల గ్రానైట్ రాయిపై పది ఆజ్ఞలను వ్రాయించి అలబామా సుప్రీంకోర్టు కార్యాలయం ఆవరణంలో పెట్టించాడు. ఇది పెద్ద దుమారం లేపింది. తను చేసిన పనిని సమర్థించుకుంటూ అమెరికా చట్టపర మరియు న్యాయ వ్యవస్థకు పది ఆజ్ఞలే మూలమని, కాబట్టి న్యాయస్థానపు ఆవరణంలో వాటిని ఉంచడం సబబేనని న్యాయాధిపతి మూర్ వాదించాడు. ఇది అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ మరియు ఇతర సంస్థలకు నచ్చలేదు. "సంఘం మరియు సమాజం వేరు" అన్న సూత్రమునకు విరుద్ధంగా పది ఆజ్ఞలను బహిరంగ ప్రవేశంలో ప్రదర్శనకు ఉంచి నిబంధనలను ఉల్లంఘించారని వారు ఈయన మీద ఒక కేసును వేశారు. రెండు సంవత్సరాల తరువాత ఆ రాయి అక్కడినుండి తొలగించ బడింది. దాని తొలగింపులో కూర్చుని ధిక్కరించినందుకు రాయ్ మూర్ కూడ అక్కడినుండి తొలగించబడ్డాడు.

ఇందులోని న్యాయపర అంశాలను పక్కన పెడితే జడ్జి మూర్ చేసినది ముమ్మాటికీ సరి అయినదే, అమెరికా దేశపు చట్టపర మరియు న్యాయవ్యవస్థకు – అలాగే అమెరికన్లలోనున్న నైతిక విలువలకు ప్రాథమిక ఆధారం పది ఆజ్ఞలే. అలాగే పాశ్చాత్య సాంస్కృతిక భావనలలో కూడ పది ఆజ్ఞల ముద్ర మనకు కనబడుతుంది.

ఉదాహరణకు, ఏదైనా విషయం స్థిరమని, ఖచ్చితమని మనం చెప్పదల్చుకున్నప్పుడు, దేవుడు తన ఆజ్ఞలను రాయిమీద వ్రాసినట్లుగా, "రాతి మీద వ్రాసినంత ఖచ్చితం" అని సాధారణంగా చెప్తుంటాము. ఏదైనా ఖచ్చితమైన జాబితాను "పది ఆజ్ఞలు" అని మనం సంబోధిస్తుంటాము. విషయం ఏదయినా గాని, దాన్ని పది ఆజ్ఞలకు సంబంధించి వ్రాస్తుంటారు – "ఈమెయిల్ విషయంలో పది ఆజ్ఞలు," "ఆటలు ఆడేటప్పుడు పాటించవలసిన పది ఆజ్ఞలు," "ఒత్తిడిని దూరం చేసే పది ఆజ్ఞలు," "వాహన రిపేరులో పది ఆజ్ఞలు" – మరియు ఇలా ఎన్నో ఉన్నాయి.

పది ఆజ్ఞల ప్రభావం ఎంతగా ఉన్నాగాని, ఇశ్రాయేలు చరిత్రలో వాటి పాత్ర ఏమిటి, వాటిని ఏవిధంగా అర్థం చేసుకోవాలి, వారి మత జీవనములో ఈనాటికీ అది ఎలా పనిచేస్తున్నాయి అన్న విషయాలు ఎక్కువ మందికి తెలియవు. ఒకసారి ఈ ఆజ్ఞలను గమనించి అవి ఏం చెప్తున్నాయో చూద్దాము.

### పది ఆజ్ఞల సాధారణ పరిశీలన

*దేవుని కృప మరియు పరిశుద్ధత వ్యక్తీకరణమే పది ఆజ్ఞలు.* ఐగుప్తునుండి ఇశ్రాయేలీయులు బయలుదేరినప్పుడు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుని గురించిన మరింత అవగాహన వారికి అవసరమయింది. వారు నాలుగువందల సంవత్సరాలు అన్యుల

సంస్కృతి, సంప్రదాయాలను చూస్తు బానిసత్వములో ఉండిపోయారు. వారికి ఆలయం లేదు, యాజకత్వము లేదు. వారిని ఆత్మీయంగా నడిపించే లేఖనములు లేవు. కాబట్టి వారిని ఐగుప్తునుండి బయటకు తీసుకువచ్చిన తరువాత అవసరమైన మొట్టమొదటి పని ఏమిటంటే, తమ దేవునితో వారికి సత్సంబంధం ఏర్పడేలా చేయబడడం.

దేవుడు వారిని ఐగుప్తునుండి విడిపించిన తక్షణం అరేబియా ప్రాంతములోని సీనాయి పర్వతం నొద్దకు ఆయన వారినందరిని నడిపించాడు. అక్కడ వారు ఆయనకు స్వజనాంగముగా నుండునట్లు, ఆయన వారికి దేవునిగా నుండుటకు వారితో ఒక నిబంధన చేసుకున్నాడు. ఈ నిబంధనలోని నియమం ఏమిటంటే, మోషే ద్వారా వారికియ్యబడిన ధర్మశాస్త్రమును ఆచరించడమే ఇశ్రాయేలు విధి. దేవునితో ముఖాముఖి సమావేశం కొరకు మోషే కొండమీదకు వెళ్ళి పది ఆజ్ఞలతో (హెబ్రీలో, “పది మాటలు”) తిరిగి వచ్చాడు. వీటినే “దశాజ్ఞలు” అని కూడా అంటారు.

దేవుడిచ్చిన “పది ఆజ్ఞలు” ఆయనలో రెండు ప్రాముఖ్య లక్షణాలను తెలియజేస్తున్నాయి. ఆయన కృపను మరియు పరిశుద్ధతను అది తెలియజేస్తున్నాయి. ప్రజలు దేవున్ని ఎదుర్కొనుటకు ముందు వారు చేయవలసిన ముందస్తు సిద్ధపాటును గురించి నిర్గమకాండము 19:10–15 తెలియజేస్తుంది. వారు తమ్మును తాము పరిశుద్ధ పరుచుకోవాలి, ఎవరూ కూడా పరిశుద్ధ పర్వతమును తాకకూడదు. ఒకవేళ ఒక జంతువు పర్వతమును తాకితే, దాన్ని రాళ్ళతో కొట్టి చంపివేయాలి. దాన్ని తాకుటకు ఎవరూ సమీపించకూడదు. ఇందులోని పరిశుద్ధత నియమపు హెచ్చరికలను గురించి 20 నుండి 22 వచనాలు తెలియజేస్తున్నాయి. దేవుని ఎదుట సేవచేయు యాజకులు “యెహోవా వారిమీద పడకుండునట్లు యెహోవా యొద్దకు చేరు యాజకులు తమ్ముతామే పరిశుద్ధపరచుకొనవలెను” (19:22). పరిశుద్ధమైన దేవుని ప్రసన్నత యొక్క మహాత్యము, వైభవము మరియు భయంకరతను గురించి ప్రజలకు వివరించుటకు ఆయన ఈ ఏర్పాటును చేశాడు.

మొదటి నాలుగు ఆజ్ఞలు (20:1–11) దేవుని పరిశుద్ధతను స్పష్టం చేస్తున్నాయి. పరిశుద్ధత అంటే ప్రాథమికంగా ప్రత్యేకించబడడం మరియు విభిన్నముగా నుండడం. అనేక దేవుళ్ళలో తన దేవుడు ఒకడు కాదని ఇశ్రాయేలు గుర్తించాలి. ఆయనకు మనం ఏ ఆకారమును ఆపాదించలేము. తన ప్రజలను ఆదరించు విషయములో “దేవుళ్ళు” అని పిలువబడేవారెవరూ ఆయనకు సాటిరారు. ఆయన నామమును గౌరవముతో నుచ్చరించాలి. తన సృజనాత్మక కార్యములో ఈ సృష్టిని ఉనికిలోకి తెచ్చినందుకు ఆయన ప్రజలు “సబ్బాతు దినమును పరిశుద్ధముగా పాటించాలి.” దేవుని ప్రజలకు ఈ ఆజ్ఞలు పరిశుద్ధత హద్దులను ఏర్పాటు చేశాయి. ఆయన పరిశుద్ధతను బట్టి మనమందరము పరిశుద్ధులమైయుండాలి. ఈ ఆజ్ఞ ధర్మశాస్త్రములో స్పష్టముగా పేర్కొనబడింది (లేవీయకాండము 11:44, 45) మరియు ఇదే ఆజ్ఞ క్రొత్త నిబంధనలో అపొస్తలుడైన పేతురు చేత మరోసారి జ్ఞప్తికి తేబడింది (1 పేతురు 1:15, 16).

తన కృపాధారము చేత దేవుడు తన పరిశుద్ధతలోనికి మనలను పిలుస్తున్నాడు. దేవుడు మనకంటే శక్తిమంతుడు కాబట్టి ఆయన యిచ్చిన పది ఆజ్ఞలను కేవలం “నియమాల పట్టికగా” భావించి తేలిగ్గా తీసుకోవడం పెద్ద తప్పు. అవి ఆయన కృపకు భావరూపములు. కేవలం దేవుని కృపచేతనే ఇశ్రాయేలు దేవుని చేత ఎన్నుకోబడింది. తన కృపచేతనే దేవుడు

ఇశ్రాయేలును బానిసత్వమునుండి విడిపించాడు (నిర్గమకాండము 19:4; 20:2). వారితో చేసుకున్న నిబంధన మరియు అందరి ఆశీర్వాదములన్నియు కృపకు కార్యములే! ఆజ్ఞలు దేవుని స్వభావమును తెలియజేస్తున్నాయి. సభ్యత మరియు నైతిక విలువలు అనేక అనాలోచిత నియమాలు కాదుగాని, దేవుడు ఏమైయున్నాడో, తన ప్రజలనుండి ఆయన ఏమి ఆశిస్తున్నాడో తెలియజేసేవి అవి.

*ఆజ్ఞలు నిలువుగాను, సమాంతరముగాను నిర్దేశించబడ్డాయి* "నిలువుగా" అంటే, దేవునితో మనం సంబంధం కలిగియుండేలా అవి నిర్దేశించబడ్డాయి. సమాంతరముగా అంటే, యితరులతో మన సంబంధాలు మెరుగుపడేలా ఇవి నిర్దేశించబడ్డాయి. ఈ ఆజ్ఞలను జాగ్రత్తగా గమనిస్తే మొదటి నాలుగు ఆజ్ఞలు ప్రాథమికంగా నిలువుగా నిర్దేశించబడ్డాయి (ఏ యితర దేవుళ్ళు ఉండకూడదు. విగ్రహారాధన కూడదు, దేవుని నామమును జాగ్రత్తగా ఉచ్చరించాలి, సబ్బాతును పాటించాలి). మిగిలిన ఆరు ఆజ్ఞలు సమాంతరముగా నిర్దేశించ బడ్డాయి (తల్లిదండ్రులకు గౌరవం, హత్యకూడదు, వ్యభిచారం కూడదు, దొంగతనం కూడదు, అబద్ధ సాక్ష్యం కూడదు, దురాశ కూడదు).

ఈ పరిశీలన యొక్క ప్రాముఖ్యత ఏమిటి? *మొదటిగా, యితరుల యెడల అమర్యాదను ప్రదర్శిస్తూ దేవునితో సరయిన సంబంధం కలిగియుండలేమని స్పష్టం చేస్తుంది.* యెహోవా దీన్నే 1 యోహాను 4:20తో వివరిస్తున్నాడు. "ఎవడైనను – నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు." దేవున్ని ప్రేమించడం, తన పొరుగువానిని ప్రేమించడం రెండూ కూడ సమ పద్ధతిలో జరగాలని యేసు ప్రభువు బోధిస్తున్నాడు (మత్తయి 22:35-40).

*రెండవదిగా, దేవునితో సరైన సంబంధం కలిగియుండడం వలననే ఇతరులతో సత్సంబంధం కలిగియుండడమని నిలువు/సమాంతర నిర్దేశిత పది ఆజ్ఞలు తెలియజేస్తున్నాయి.* ఎంతో మంది ఇతరలతో సత్సంబంధం కలిగియుండలేకపోవడానికి గల ప్రాథమిక కారణం ఏమిటంటే వారికి దేవునితో సంబంధం లేకపోవడమే. మనం దేవునితో సమాధానం కలిగియుండలేకపోతే పొరుగువారితోను సమాధానం కలిగియుండలేము (దీనికి గల ఉదాహరణను యాకోబు 4:1-4లో చూడు).

ఈ ఆజ్ఞలు వాస్తవికముగాను, రక్షణాయుక్తముగానున్నాయి. పదింటిలోని ఎనిమిది ఆజ్ఞలు "కూడదు, చేయకూడదు" అన్న నకారాత్మక ధోరణిలోనే ఇయ్యబడ్డాయి. దీనర్థం దేవుడు ప్రతిదాన్ని వ్యతిరేకిస్తాడని కాదు, గాని, మానవ సహజనైజమును గురించి దేవుడు వాస్తవికముగా ఆలోచిస్తున్నాడని స్పష్టం అవుతుంది. ఇటువంటి నిర్బంధకములు లేకపోతే, మనం చంపుతాము, దొంగతనం చేస్తాము, అబద్ధమాడతాము, ఇతర పాపములు చేస్తాము. మానవ పాపము గురించి వ్యవహరించినప్పుడు ఎటువంటి యుక్తి కుయుక్తి అవసరం లేదు. ఎందుకంటే, పాపము విషయంలో మానవ నైజము గురించి దేవుడు చాలా పౌరధర్మంగా వాస్తవికముగా చెప్పాడు.

మన స్వనాశనమును నిరోధించే విధముగా ఆజ్ఞలు "రక్షణాయుక్తముగా" నిర్మించబడ్డాయి. "నీవు పది ఆజ్ఞలను మీరావంటే, నీకు నీవే తిరిగి దానిమీద పడ్డావు" అని ఒకరు అన్నారు. దేవుని న్యాయ విధులను మనం త్రోసిపుచ్చినప్పుడు, మనకు మనమే

స్వనాశనం తెచ్చుకుంటున్నాము. ఉదాహరణకు భూమ్యాకర్షణ సిద్ధాంతమును చూడండి. ఇది అందరికి తెల్సిందే. దేనినైనా ఒకటి నిర్బంధించకపోయినట్లయితే, అది ఆకర్షణకు లోనై భూమి మీదపడుతుందని మన అనుభవం, శాస్త్రము తెలియజేస్తుంది. కొంతమంది దాన్ని తిరస్కరించవచ్చు. అసత్యమని ఆరోపించవచ్చు. కానీ వారు ఎత్తైన బిల్డింగు మీదనుండి పడితే వారు భూమ్యాకర్షణ సిద్ధాంతము మీదనే తిరిగి పడతారు. ఏదయితే సత్యమో అది సిద్ధాంతము, విధి. దానిని మనం అంగీకరిస్తే నాశనం కాకుండయుంటాము. దాన్ని తిరస్కరిస్తే మనం నాశనమైపోతాము. కాబట్టి మనలను రక్షించడానికే దేవుడు ఆజ్ఞలను ఇచ్చాడు. మనమాయన్ను గౌరవించాలని, మనం సురక్షితంగానుండాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు.

ఐగుప్తునుండి ఇశ్రాయేలు విడిపింపబడిన తరువాత పది ఆజ్ఞలు ఇవ్వడం ద్వారా దేవునికి లోబడడం ద్వారానే నిజమైన స్వాతంత్ర్యం వస్తుందని దేవుడు గుర్తు చేశాడు. ఏ బంధకాలు లేని స్వేచ్ఛా జీవితమే బానిసత్వము యొక్క రూపము. కాబట్టి వారు దేవుని మాటను తిరస్కరించినట్లయితే, వారు తిరిగి బానిసత్వములోనికి వెళతారు.

## పది ఆజ్ఞల వివరణ

పది ఆజ్ఞలు వాటికవే వివరణను యిస్తున్నాయి. కాబట్టి ప్రత్యేకమైన విస్తార వివరణ అవసరం లేదు. వాటి అర్థం కంటే వాటి అన్వయింపే ఎక్కువగా వివరించబడింది. కొన్ని వ్యాఖ్యాలు మాత్రం అవసరం అవుతాయి.

"నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు" (20:3) అన్న మొదటి ఆజ్ఞను బట్టి, దేవుడు వారి మధ్యలో ప్రాముఖ్యం ఉన్నంతవరకు వారు యితర దేవతలను ఆరాధించుకోవచ్చని దీని ఉద్దేశం కాదని అర్థమవుతుంది, ఉన్నది ఒక్కడే దేవుడని స్పష్టం అవుతుంది (యెషయా 44:6). ఒక్క దేవుని మీదనే నమ్మికయుంచుటను ఏక దైవారాధన అని పిలుస్తారు. అప్పటి ప్రాచీన ప్రపంచములో ఇశ్రాయేలు ఒక్కటే ఏక దైవారాధనను అవలంభించిన ప్రత్యేక దేశముగా మిగిలిపోయింది. ఇశ్రాయేలు ప్రక్క దేశంలో ఉన్న బహుదేవతారాధనను బట్టి ఇతర అనేక దేవతలను తమ జాబితాలో "చేర్చుటకు" వారు శోధింపబడ్డారు. అందుకు ప్రతిగా ఎంతో మూల్యమును చెల్లించాల్సి వచ్చింది. దీన్ని సమూయేలు, రాజుల గ్రంథాలు వివరిస్తున్నాయి.

అన్యదేవతారాధనను, ఆఖరికి సత్య దేవుని విగ్రహ రూపమును కూడ రెండవ ఆజ్ఞ (20:4-6) నిషేధిస్తుంది. విగ్రహ రూపములు అసలు రూపమునకు, అది చూపించే ప్రతిబింబమునకు మధ్య తేడాను చూపిస్తున్నను నిజానికి విగ్రహ రూపములు ప్రజల మనసుల్లో దేవున్ని అధికమిస్తాయి. ఇది ఒక కారణం. మరొక కారణమేమంటే, ఏ రూపము కూడ దేవుని ఖచ్చితమైన రూపమును ప్రతిబింబించలేదు. "దేవున్ని మన రూపములో సృష్టించుటకు" చేసే ప్రయత్నమే విగ్రహాలు. మనము ఆయన రూపములో సృజించబడ్డామన్న నిజాన్ని విస్మరించడమే. ఒకసారి ప్రజలు "దేవుని విగ్రహమును" చేశారంటే, ఆ దేవునికి ఏం కావాలో, ఏం చేయాలో ప్రజలే నిర్ణయిస్తుంటారు. నిజానికి వారు తమ స్వంత అహమునే పూజిస్తుంటారు (రోమీయులకు 1:18-23). దేవునికి వ్యతిరేకముగా ఏ శత్రువు ఉండుట ఆయనకు యిష్టం లేదని రెండవ ఆజ్ఞ స్పష్టం చేస్తుంది. ఆయన రోషముగల దేవుడు, సహించలేడు. అంటె మానవులవలె పోటీ తత్వమునకు భయపడి లేదా వెనుదిరిగే వంటి వారు కాదు గాని, తన ప్రజలనుండి తనకు మాత్రమే హృదయ పూర్వక ఆరాధనను కోరుకొనేవాడు.

మనము ఆయనను ఆరాధించువారమైతే, ఆయన ఒక్కడే మనకు దేవుడు.

దేవుని నామమును "వ్యర్థముగా" ఉపయోగించుటను నిర్గమకాండము 20:7 నిషేధిస్తుంది. "వ్యర్థముగా" అన్న పదమునకు "శూన్యముగా" లేక "అర్థరహితముగా" అన్న అర్థము ఉంది. అర్థరహిత ప్రమాణాలు చేయునప్పుడు దేవుని నామమును వ్యర్థముగా వాడకూడదన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఉదాహరణకు, నెరవేరే ఉద్దేశముగాను లేదా నిరర్థకముగా దేవుని పేరును పలుకడమే అయితే ఈ నాటి సమాజం ఈ ఆజ్ఞను నిర్దేవంగా త్రోసిపుచ్చుతుంది.

"విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించవలెనన్న" నాల్గవ ఆజ్ఞను 8 నుండి 11 వచనాల్లో చూస్తున్నాము. ఈ ఆజ్ఞ యొక్క ప్రాముఖ్యత దీని వివరణలోనే ఇయ్యబడింది. "దేవుడైన యెహోవా యొక్క విశ్రాంతి దినముగా" ఇది పిలువబడింది. ఇది దేవునికి ప్రతిష్ఠితమైన దినం. ఈ దినమున పనిచేయకూడదు. తమను సృష్టించిన దేవుని జ్ఞాపకం చేసుకుంటూ, దినవారే పనులకు విరామం యిస్తూ ప్రతి ఏడవ దినమును ప్రత్యేకపరచాలి. క్లుప్తంగా చెప్పాలంటే, విశ్రాంతి దినము అంటె ఇశ్రాయేలునకు ఆరాధన, విశ్రాంతి మరియు దేవుని జ్ఞాపకార్థ దినము.

"నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము" అన్న ఆజ్ఞకు తోడుగా ఒక వాగ్దానం కూడ జతచేయబడిఉంది. "నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు ..." (20:12) ("వాగ్దానముతో కూడిన మొదటి ఆజ్ఞ" ఇదని పౌలు తరువాత వ్యాఖ్యానిస్తున్నాడు; ఎఫెసీయులకు 6:1, 2). ఈ ఆజ్ఞను అనుసరించిన వారు అత్యధిక కాలం జీవిస్తారని ఈ వాగ్దానాన్ని కొంతమంది అర్థంచేసుకున్నారు. ప్రాథమికమైన గౌరవ మర్యాదలు లేని ఏ దేశమైనా ఎక్కువ కాలం లేదని ఈ వాగ్దానం స్పష్టం చేస్తుంది. తల్లిదండ్రుల పట్ల అమర్యాద గర్వమునకు గుర్తు. ఇది సమాజంలో మనలను నీచులుగా నిలువబెడుతుంది. ఇదే ఒక్కోసారి దేశం పతనమునకు కారణమవుతుంది.

నిర్గమకాండము 20:13లో చెప్పబడిన నరహత్య నిషేధము. దేవుడు యుద్ధములు, ఉరి శిక్షను నిషేధిస్తున్నాడా లేదా అన్న అంశమును గురించిన విస్తార చర్చకు కారణమవుతుంది. "చంపుట" అన్న పదమునకు ఒక మూల పదము యొక్క అర్థము "హత్య చేయుట" కాబట్టి ఇది యుద్ధములు మరియు ఉరిశిక్షలకు సంబంధించినది కాదు. ఈ రెండింటిని ఇశ్రాయేలు (దేవుని ఆజ్ఞమేరకే) అభ్యసించిందని పాత నిబంధన భాగాలు తెలియజేస్తున్నాయి.

14 నుండి 16 వచనాలు తమ భావాన్ని అవే తెలియజేస్తున్నాయి. కానీ ఇశ్రాయేలీయులు తమ మధ్య నాగరికతను దెబ్బతీయకుండా వాటి ప్రాధాన్యతను గుర్తించవలసియుంది. సమాజంలోని నైతికత మరియు విలువలను గూర్చి ఈ ఆజ్ఞలు మరోసారి చెప్తున్నాయి. వ్యభిచారం, దొంగతనం, అబద్ధమాడడం వంటివి సమాజములో సమైక్య జీవనమును ఆటంకపరుస్తాయి. ఈ అవలక్షణాలను మన సమాజంలో గమనిస్తే, ఇది మరింత స్పష్టమవుతుంది. ఈ ప్రాథమిక సత్యాలను మరిచినప్పుడు సమాజం నాశనమునకు నడిపించబడుతుంది.

మనది కానిదాన్ని ఆశించడం లేదా దురాశను పదవ ఆజ్ఞ (20:17) నిషేధిస్తుంది. హృదయంలోని దురాశ వ్యభిచారమునకు, దొంగతనమునకు, అబద్ధసాక్ష్యమునకు, ఆఖరికి హత్యకు కూడ దారితీస్తుంది. తీవ్రత విషయంలో ఆజ్ఞలు ఆరోహణ క్రమములో ఉన్నాయని కొంతమంది చెబుతారు. కానీ దురాశ యొక్క ప్రతిఫలం మాత్రం దీనికి వ్యతిరేకముగా

ఉంది. అనేకమంది గమనించినట్లుగా, మిగతా ఆజ్ఞలన్నియు క్రియలు, కార్యములమీద దృష్టిపెడుతుంటే, ఆఖరి ఆజ్ఞమాత్రం, హృదయం యొక్క వైఖరి మీద దృష్టి పెట్టబడింది. క్రొత్త నిబంధనలో పౌలు దురాశను విగ్రహారాధనతో పోల్చి చెప్పడం చూస్తే ఇదేమంత ప్రత్యేక పరిశీలనగా అన్పించదు (ఎఫెసీయులకు 5:5; కొలొస్సయులకు 3:5). హృదయపు ఆలోచనలే కార్యములుగా ఉంటాయని మనం గమనించాలి. ఏ నిర్బంధము లేని దురాశ యొక్క ఫలితం చాలా కఠినంగా యుంటుంది.

దేవుడిచ్చిన ఈ "పది మాటలను" పరిశీలించిన తర్వాత, దేవుడు మోషేకిచ్చిన ధర్మశాస్త్రములో "సారాంశము" ఇది అని మనం గ్రహించగలము. అంతేగాని ఇదే పూర్తి సందేశం కాదు. నిర్గమకాండము 21-23 అధ్యాయములు మరియు లేవీయకాండము గ్రంథంలో దేవుడు ఎన్నో విధులను ఇచ్చాడు. ఇవన్నియూ ఈ పది మాటలనుండి వృద్ధికొచ్చాయి! మోషే ధర్మశాస్త్రము యొక్క విధులను మనం ఎన్నడూ తేలిగ్గా తీసుకోకూడదు, "నేను పది ఆజ్ఞలను అనుసరించి జీవిస్తున్నాను కాబట్టి నేను దేవునితో సరిగ్గానే ఉన్నాను" అని మనం చెప్పడానికి వీల్లేదు. దేవునితో సత్సంబంధం కలిగియుండుటకు పది ఆజ్ఞలు ఒక శుభారంభమే కానీ దేవునితో సత్సంబంధం కోసం యింకా ఎంతో ఉంది.

## ఈనాటి కాలానికి పది ఆజ్ఞల అన్వయింపు

చాలా కాలం క్రితం ఒక ప్రత్యేక జనాంగమునకు పది ఆజ్ఞలు ఇయ్యబడ్డాయి. మన సాంస్కృతిక సంప్రదాయాలు, చారిత్రిక నేపథ్యం వారికంటే భిన్నముగా ఉన్నాయి కాబట్టి ఈనాడు మనకు పది ఆజ్ఞలలో ఏవిధంగా పొంతన కుదురుతుంది?

*మొదటిగా, నిత్యత్వపు విలువలున్న నైతిక విషయాలను గూర్చి అవి మనకు తెలియజేస్తున్నాయి.* ప్రస్తుతం మనమున్న కాలములో "నైతిక అసంబద్ధత" ప్రచురంలో ఉంది. అంటే ఇది తప్పు, ఇది సరైనది అని మనం చెప్పలేము. ఏదీ నిర్దిష్టమైనది కాదు. ఒక వ్యక్తి తానున్న పరిస్థితినిబట్టి ఇది తప్పు లేదా ఇది సరైనది అని మాత్రమే చెప్పగలము. ఈ ఆలోచనా విధానమును బట్టి. ఒక వ్యక్తికి ఒప్పు అయినది మరొకరికి తప్పు కావచ్చు. ఏదీ ఖచ్చితం కాదు.

కానీ ఆజ్ఞలు ఇందుకు విరుద్ధముగా ఉన్నాయి. మనిషి ఉన్న పరిస్థితిని బట్టిగాని, కొన్ని విషయాలు తప్పంటే తప్పని, మరికొన్ని సరైనవి ఎల్లప్పుడూ సరైనవని ఇది చెప్తున్నాయి. అవి దేవుడిచ్చిన నైతిక విధులకు సంబంధించిన స్పష్టమైన ఆదేశాలు.

పది ఆజ్ఞలకున్న ఈ లక్షణమే, అది వివాదాస్పదమయ్యేలా చేశాయి. దీనివలననే అనేకమంది వీటిని ప్రజల మనస్సులనుండి తొలగించాలని చేసిన ప్రయత్నానికి కారణమయింది. ఇందుకు గల మరో కారణమేమంటే, ఇది క్రైస్తవేతరులు మరియు యూదేతరుల మత విశ్వాసాలను దెబ్బతీసిందని కాదు గాని, ఏదీ నిర్దిష్టంగా తప్పు కాదు. ఏదీ ఒప్పు కాదు అన్న విషయాన్ని ఇది ఖండిస్తుంది. నిజానికి వీటిని పూర్తిగా రూపుమాపాలనే దురుద్దేశం గల ప్రజలకు ఇది గురవుతున్నాయి. ఇందులో భాగంగా వారు ఈ వ్యాఖ్యానాలను చేస్తుంటారు:

> ఈ మాటలు సత్యమునకు దూరంగానున్నాయి ... ఇందులోని మొదటి నాలుగు ఆజ్ఞలు ప్రజల విశ్వాస సంప్రదాయాలను అంగీకారం కాని ఆరాధనా పద్ధతులు ...

యెహోవా దేవుని తప్ప మరే దేవుని ఆరాధించకూడదని మొదటి ఆజ్ఞ తెలియజేస్తుంది. ఇతర మతాలైన భౌద్ధమతం, హిందుమతం, సిక్కుమతం, విక్కా వంటి యితర మతాలను ఇది ఖండిస్తుంది. మత స్వేచ్ఛను కల్పించిన అమెరికా దేశపు రాజ్యాంగ మొదటి శాసనమునకు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది. ఇతర మతములను సహించలేనిదిగా ఇది ఉంది. ఇతర మతములపై ఇది ద్వేషపూరిత భావాలను ప్రేరేపించేదిగా ఉంది.

హెబ్రీ అనే చిన్న జాతికి దేవుడిగా వ్యవహరించుతున్న ఏల్ అనే ఒక చిన్న దేవుని అహమునకు పది ఆజ్ఞలలోని నాలుగు ఆజ్ఞలు కేటాయించబడ్డాయి. మిగతా ఆజ్ఞలు కూడ బలహీనమైనవే, నిరర్థకమైనవి.[1]

ఆఖరి వ్యాఖ్య చేసిన రచయిత్రి "మానవుల ప్రవర్తన నియమావళిని" కొనసాగిస్తూ తన "పది తార్కిక ఆజ్ఞలలో" మరిన్ని వ్యాఖ్యలు చేసింది. ఆ పదింటిలో ఒకటి ఇలా ఉంది "నీ అభిప్రాయాలను నీ దగ్గరే ఉంచుకో. ఎవరిని మార్చడానికి ప్రయత్నం చేయకు. నీ అభిప్రాయాలను, విశ్వాసాలను మరొకరిపై రుద్దకు. ఆఖరికి నీ పిల్లలకు కూడా చెప్పకూడదు."

దేవుడిచ్చిన పది ఆజ్ఞలకు బదులుగా ఒక గుంపువారు "ప్రత్యామ్నాయ పది ఆజ్ఞలను" రూపొందించారు. ఎందుకంటే, "ఇవి విభిన్న విశ్వాస గుంపులకు మరింత ఆమోదముగా ఉంటాయన్నది" వారి వాదన. వారి ఆజ్ఞల జాబితాలో దేవున్ని గురించి లేదా మరే యితర దేవతల గురించిన ఆజ్ఞ లేదు. ఆజ్ఞలను గూర్చిన రెండవ జాబితాలో ఈ విధంగా ప్రారంభమవుతుంది, "నీవు ఏ దేవుడ్నయినా ఆరాధిస్తుంటే, ఆ దేవుడ్ని నీ విశ్వాస సంప్రదాయం చొప్పున గౌరవించి, ఆరాధించు."

వీటిని బట్టి గమనిస్తే, వారికున్న సాధారణ లక్ష్యం ఒక్కటే: ఇది తప్పు లేదా ఒప్పు మరియు ఇది మంచిది లేదా చెడ్డది అని దేవుడు ఏర్పరచిన నిర్దిష్ట ఖచ్చిత విలువలను త్రోసిపుచ్చడం, అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచిని చెడును బోధించకుండా చూడడం. తాము వాదిస్తున్నది తార్కికమైనది, సహేతుకమైనది అని వాదిస్తున్నవారు ఇందుకు అతీతులని మనం భావించవచ్చు.

మానవుల సమాజములో పది ఆజ్ఞలలో పేర్కొన్న సమస్యలు సహజంగా జరిగేవే కాబట్టి వీటిని పది ఆజ్ఞలు ఖండిస్తున్నాయి. ఇందునుబట్టి క్రొత్త నిబంధనలో యేసు క్రీస్తు మరియు ఇతర అపొస్తలులు అదే ఆజ్ఞలను బోధించారు. ఎందుకంటే, అదే సమస్యలు అప్పటికీ, ఇప్పటికీ సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయి కాబట్టి.

*రెండవదిగా, పది ఆజ్ఞలు మనం రక్షించబడడానికి ఉద్దేశించినవి కాదు గాని, రక్షకుని వైపు మనం తిరగడానికి ఉద్దేశించినవి.* పది ఆజ్ఞలను మనం యథార్థముగా గమనించినట్టయితే, మనం ఎంత బాగా ఉండాలని అవి చెప్పడం లేదు గాని, దేవుని మహిమను ఎంత త్వరగా మనం కోల్పోతున్నామో తెలియజేస్తున్నాయి. దీన్ని మనం గ్రహించినట్టయితే, రక్షకుని అవసరత మనకు ఎంత ఉందో కూడ మనం గ్రహించగలము. క్రొత్త నిబంధన గ్రంథకర్తలు దీన్ని బాగుగా గ్రహించారు:

విశ్వాసము వెల్లడికాకమునుపు, ఇక ముందుకు బయలుపరచబడబోవు విశ్వాసమవలంబింపవలసిన వారముగా చెరలో ఉంచబడినట్లు మనము ధర్మశాస్త్రమునకు లోనైన వారమైతిమి. కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు

> క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము. యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు. ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని, స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు (గలతీయులకు 3:23-28).

> ప్రతి నోరు మూయబడునట్లును, సర్వలోకము దేవుని శిక్షకు పాత్రమగునట్లును, ధర్మశాస్త్రము చెప్పుచున్న వాటినన్నిటిని ధర్మశాస్త్రమునకు లోనైనవారితో చెప్పుచున్నదని యెరుగుదుము. ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు; ధర్మశాస్త్రమువలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది.
>
> ఇట్లుండగా ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతిబయలుపడుచున్నది; దానికి ధర్మశాస్త్రమును ప్రవక్తలును సాక్ష్యమిచ్చుచున్నారు. అది యేసుక్రీస్తునందలి విశ్వాసమూలమైనదై, నమ్మువారందరికి కలుగ దేవుని నీతియైయున్నది. ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుపరచవలెనని క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసముద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను (రోమీయులకు 3:19-25).

> ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయినయెడల ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును; వ్యభిచరింపవద్దని చెప్పినవాడు నరహత్య చేయవద్దనియు చెప్పెను గనుక నీవు వ్యభిచరింపకపోయినను నరహత్య చేసినయెడల ధర్మశాస్త్రవిషయములో అపరాధివైతివి (యాకోబు 2:10, 11).

పాపమంటే ఏమిటో పది ఆజ్ఞలలో నిక్షిప్తమైయున్న ధర్మశాస్త్రం తెలియజేస్తుంది. కానీ అదొక్కటి మనలను రక్షించదు. పది ఆజ్ఞలను మాత్రమే అనుసరిస్తూ రక్షించబడాలంటే అది సాధ్యం కాదు. చికిత్స స్వస్థత పొందినట్లు కాదు. ధర్మశాస్త్రము పాపమనే చికిత్సనిస్తుండగా, సువార్త యేసు క్రీస్తు అనే సంపూర్ణ స్వస్థతనిస్తుంది. ధర్మశాస్త్రమును అనుసరించుటవలన లభించిన రక్షణ కొరకు పది ఆజ్ఞలను వినగానే అవి మనలను క్రీస్తుసిలువనొద్దకు నడిపించ గలగాలి.

ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రమిచ్చుటకు దేవుడు వారిని సీనాయి పర్వతమునొద్ద సమావేశపరచినప్పుడు, వారితో తన నిబంధనకు సంబంధించి ప్రాథమిక నియమాలను దేవుడు ప్రజలకు వివరించుటకు మోషేకు చెప్పాడు. ఆ నియమములు నిర్గమకాండము 19:5, 6ఎలో క్లుప్తీకరించబడ్డాయి: “కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురు” అందుకు ప్రజలు, “యెహోవా చెప్పినదంతయు చేసెదమని” (19:8) ఏకముగా సమాధానమిచ్చారు. విధేయత, లోబడడం అనే వైఖరితోనే మనం దేవుని నిబంధనలో ప్రవేశించగలము. ఇది “చేయు,” ఇది “చేయకూడదు” అన్న జాబితా పది

ఆజ్ఞలు ఇశ్రాయేలును ప్రేమ, నమ్మకము అనే నిబంధనకు నడపించింది. ఈనాడు మనం క్రీస్తు ద్వారా మనమెంత పాపులమైనా, మరే జాతియైనా, మన నేపథ్యం ఏదయినా, మనం నిత్య నిబంధనకు పిలువబడుతున్నాము. దేవుడు మనలను ఆహ్వానిస్తున్నాడు అందుకు మనం లోబడదామా?

---

సూచన

[1]"మత స్వేచ్ఛాపరులు" అని తమ్మును తాము పిలుచుకుంటున్నవారు తమ వెబ్‌సైట్‌లో ఈ వ్యాఖ్యాలను చేశారు (www.sea1fd.hotmail.msn.com; Internet; accessed May 2009). ఈ సమాచారం ఎక్కువ కాలం అందులో అందుబాటులో ఉండదు కాబట్టి వాటిలో కొన్ని వ్యాఖ్యలు, మరిన్ని ఇదే అంశ వ్యాఖ్యలు http://www.religioustolerance.org/chr_10cn. htm; Internet; accessed 3 February 2010 అన్న వెబ్‌సైట్‌లో దొరుకుతాయి.

---

## విశ్రాంతి దినము

విశ్రాంతి దినము (*shabbath,* "నిలువ చేయుట") అనేది ఏడవ దినము అని, సృష్టి కార్యములోని ఏడవ దినము అని. ఆ దినమున దేవుడు "విశ్రాంతి" (ఆదికాండము 2:2, 3) తీసుకున్నాడని నిర్గమకాండము 20:9, 10 తెలియచేస్తుంది. ఈ పదం యొక్క అర్థం దేవుడు అలిసిపోయాడని కాదు గాని, ఆయన తన సృష్టి కార్యమును ముగించాడని అర్థము. దేవుడు ఈ లోకమునకు సృష్టికర్త మరియు సంరక్షకుడు కాబట్టి దాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఇశ్రాయేలీయులు ప్రతి వారం ఏడవ దినమున ఏ పనియు చేయకూదు. విశ్రాంతి దినమును పాటించుటకు గల మరో కారణం మనకు ద్వితీయోపదేశకాండము 5:15లో కనబడుతుంది: ఐగుప్తు దాసత్వమునుండి దేవుడు ఇశ్రాయేలును విడిపించాడు. బహుశ బాధపడిన ఆ జనమునకు తగు విశ్రాంతినిచ్చుటకు దేవుడు దీనిని ఇచ్చాడు.

విశ్రాంతి దినమును "పరిశుద్ధముగా" ఆచరించుటకు "జ్ఞాపకముంచుకొనుము" అన్న మాటకు అర్థము. అన్ని దినములవలె గాక, దీనిని దేవునికి ప్రత్యేకముగా ఉంచాలి. ఈ ఆజ్ఞను ఉల్లంఘించడమంటే, దేవుడు ఇశ్రాయేలుతో చేసుకున్న నిబంధనను ధిక్కరించడమే (నిర్గమకాండము 31:12–17).

యేసుక్రీస్తు కాలంలో విశ్రాంతి దినము యొక్క పవిత్రతను కాపాడుటకు దానికి మరిన్ని అదనపు ఆచారములను చేర్చారు. దీన్ని ఒక మూఢ విశ్వాసంలాగా ఆచరిస్తుండేవారు. ఆ దినమున "ఏ పనియు చేయకూడదు" (నిర్గమకాండము 20:10) అని దేవుడు "పని" గురించి చెప్పిన మాటకు అప్పటివారు వక్ర భావ్యమును ఇచ్చారు. దీన్ని ఆధారం చేసుకొని సబ్బాతు దినాన అవసరతలో ఉన్నవారిని ఆదుకొనుట మరియు రోగులను బాగుచేయుట చట్ట విరుద్ధమని భావించేవారు. దీని విషయమై యేసు క్రీస్తు తన కాలంలోని మతాధికారులతో తరచూ వాదించేవారు. ఇందుకు కారణం, నిర్గమకాండములోని విశ్రాంతి దినపు ఆజ్ఞను అతిక్రమించడం కాదు గాని, దీనికి అదనంగా పరిసయ్యులు జోడించిన నియమములను ప్రభువు త్రోసిపుచ్చడమే కారణం (ఉదాహరణకు, చూడు, మార్కు 3:1–6; లూకా 13:10–17; యోహాను 5:1–16; 9:1–41). సబ్బాతు నియమములను ప్రభువు మరియు ఆయన శిష్యులు ఉల్లంఘించినందుకు మతాధికారులు చేసిన విమర్శలకు ప్రభువు రెండు సత్యముల ద్వారా సమాధాన మిచ్చారు: "విశ్రాంతిదినము మనుష్యులకొరకే నియమింపబడెను గాని

మనుష్యులు విశ్రాంతిదినము కొరకు నియమింపబడలేదు" మరియు "మనుష్యకుమారుడు విశ్రాంతిదినమునకు ప్రభువై యున్నాడు" (మార్కు 2:23-28).

పది ఆజ్ఞలన్నిటిలోనూ, సబ్బాతును గూర్చిన ఆజ్ఞ ఒక్కటే క్రొత్త నిబంధనలో రెండవ సారి చెప్పబడలేదు (ఆజ్ఞవలె). అంతేగాక, ఆదిమ క్రైస్తవులు వారంలోని మొదటి దినాన్ని (ఆదివారం) "ప్రభువు దినముగా" పిలుస్తూ వారు ఆ దినమున ఆరాధించేవారు (చూడు అపొస్తలుల కార్యములు 20:7; 1 కొరింథీయులకు 16:1, 2; ప్రకటన 1:10). ఈ దినమున ప్రభువు మృతిని గెల్చి పునరుత్థానుడయ్యాడు కాబట్టి ఈ దినం ఏర్పాటు చేయబడింది. అంతేగాక ఆదిమ క్రైస్తవులు ఈ దినమును పాటించుటవలన వారు యూదా మతమునుండి ప్రత్యేకతను సంపాదించుకున్న వారయ్యారు.

ఇప్పటి సంప్రదాయాల వలెగాక, ప్రభువు దినము (ఆదివారం) "విశ్రాంతి దినము" అని లేఖనాలలో ఎక్కడా చెప్పబడలేదు. "క్రైస్తవులు ఆరాధనకు కూడుకునే ఆదివారపు దినమున సబ్బాతు" (విశ్రాంతి దినము) నియమాలను అవలంబించాలన్న (మొదట్లో, ఫలించలేదు) కోరిక లేవనెత్తబడినప్పుడు సంఘ చరిత్రలు "క్రైస్తవ విశ్రాంతిదినము" అన్నమాట మొదటిసారిగా వినవచ్చింది. రెండు వేర్వేరు నిబంధనలను ఆధారం చేసుకున్న రెండు విభిన్న శాఖల మధ్య గందరగోళానికి ఇది కారణమయింది. ఇప్పటికే, దేవున్ని ఆరాధించు ప్రత్యేక దినములుగా రెండింటిని ఉపయోగిస్తున్నారు.